

భద్రతపై శ్రద్ధతీసుకోవాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా వైద్యులు, నర్సులు, సిబ్బంది భద్రత విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆస్పత్రులకు నిత్యం రోగులతో పాటు వారి బంధువులు, సహాయకులు వస్తుంటారు. అందువల్ల నిరంతర నిఘాతోపాటు పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలి. ఇక్కడి ఆస్పత్రిలో వాచ్‌మెన్, గార్డులు ఉండడం వల్ల ఎటువంటి సమస్యలు తలెత్తడం లేదు.

– డాక్టర్ ఫణికుమార్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్, భీమిలి





ఔట్ పోస్టు, సీసీ కెమెరాలు తప్పని సరి

ఆస్పత్రుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండడానికి పోలీస్ ఔట్ పోస్ట్ తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. నిరంతర నిఘా కోసం సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయాలి, అవి కచ్చితంగా చేసే విధంగా చూడాలి.

– డాక్టర్ పి.విజయశ్రీ, స్త్రీ వైద్య నిపుణురాలు, భీమిలి

క్లుప్తంగా

గణేష్ నవరాత్రులకు ఉత్సవ రాట



రాట వేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం: వినాయ చవితి ఉత్సవాల నిర్వహణకు స్థానిక చిన్నబజారు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం ఉత్సవ రాట వేశారు. ఈ కార్యక్రమంలో నాగవంశ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, సభ్యులు కె.ముత్యాలరావు, బింగి హరి కిరణ్‌రెడ్డి, రాంభక్త ప్రభాకర్ నాయుడు, బోని సంజీవరావు, అప్పికొండ కృష్ణ, ప్రగడ చంటి, గిడితూరి రాజు, లచ్చుబోతు సంతోష్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పగిలి.. తాగునీరు వృథా



సంగివలసలో పగిలిన పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలసలో శనివారం పైపులైన్ పగిలిపోయి తాగునీరు వృథాగా పోయింది. ఓ లారీ పైప్‌లైన్ పై నుంచి వెళ్లడంతో పగిలిపోయింది. దీంతో తాగునీటి సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం ఏర్పడింది. వృథాగా పోయిన నీటితో సంగివలస-పాండ్రంగి రహదారి చెరువులా మారింది. అనంతరం జీవీఎంసీ తాగునీటి సరఫరా సిబ్బంది పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు.

నేడు శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. సాలూరుకు చెందిన పూర్ణిమ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

చిన్నోడి పెద్ద మనసు



పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేస్తున్న రోహన్ చెర్ల

డాబాగార్డెన్స్ : ప్రతిభ ఉండి ఆర్థిక పరిస్థితుల కారణంగా విద్యకు దూరం అవుతుంటారు చాలా మంది పేద విద్యార్థులు. అటువంటి వారికి చేయూతనిచ్చేందుకు ముందుకు వచ్చాడు 17 ఏళ్ల రోహన్ చెర్ల. రోహన్ తాత వారణాసి సూర్యనారాయణమూర్తి విశాఖ మహా నగరంలో గల ఏవీఎన్ కళాశాలలో ఇంగ్లిషు అధ్యాపకునిగా పని చేశారు. ఆయన జ్ఞాపకార్థం కళాశాలలో బాగా చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించేందుకు రోహన్ చెర్ల ముందుకొచ్చాడు. ఈ మేరకు ఏవీఎన్ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రోహన్ చెర్ల మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తూ, వారి చదువుకు ప్రోత్సాహం అందివ్వడమే ధ్యేయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ తాను చదువుకుంటూ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. సుమారు 50 మంది విద్యార్థులకు రూ.6 లక్షలు అందజేయడం గొప్ప విషయమని చెప్పారు. కార్యక్రమంలో జోసెఫ్ మార్వెల్, సాయి హిరణ్మయి చెర్ల, రోహన్ కమత్, ఆకెళ్ల శైలజ, డాక్టర్ మహలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, కళాశాల ఇంగ్లిషు విభాగాధిపతి పైడి రజనీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భేష్... బస్సు ప్లీజ్



కె.నగరపాలెంనకు వెళ్లే రోడ్డు

- రోడ్డును విస్తరించినా పునరుద్ధరణకు నోచుకోని ఆర్టీసీ సర్వీస్
- అవస్థలు పడుతున్న ప్రజలు
- బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చెందుతుండడంతో ఈ రోడ్డులో రోజూ వేలాది మంది పర్యాటకుల రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ బీచ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న కె.నగరపాలెం వయా కాపులుప్పాడ, బోయపాలెంకు బస్సు సౌకర్యం లేక ప్రయాణికులు ఏళ్లతరబడి అవస్థలు పడుతున్నారు. గతంలో 25కె బస్సు కె.నగరపాలెం నుంచి కాపులుప్పాడ, బోయపాలెం మీదుగా విశాఖ నగరానికి వెళ్లేది. ఇక్కడ ఉన్న రోడ్డు 30 అడుగులు మాత్రమే ఉండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో బస్సును నిలిపివేశారు.

రోడ్డు విస్తరించిన గత ప్రభుత్వం

బీచ్ రోడ్డు, కె.నగరపాలెం నుంచి బోయపాలెం వెళ్లాలంటే ఓ సాహసమే. 30 అడుగుల రోడ్డులో ఓ వాహనం వస్తే మరో వాహనం ఆగిపోయే పరిస్థితి ఉండేది. దీనిని దృష్టిలో పెట్టుకుని 2000 సంవత్సరంలో రోడ్డు విస్తరించాలని ప్రణాళికలు రూపొందించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వాలు మారినా రోడ్డు పరిస్థితి మాత్రం మారలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 23ఏళ్ల నాటి కల సాకారమైంది. మొత్తం రూ.9 కోట్ల వ్యయంతో 2.5 కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరించారు. కె.నగరపాలెం నుంచి సోమన్నపాలెం వరకు 40 అడుగులు, సోమన్నపాలెం నుంచి విల్లానం వరకు 80 అడుగులు, విల్లానం నుంచి బోయపాలెం వరకు 100 అడుగులు రోడ్డును విస్తరించారు. రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.

విస్తరించి ఆరు నెలలవుతున్నా...

రోడ్డు విస్తరణ జరిగి ఆరు నెలలు కావస్తున్నా బస్సు సౌకర్యం మాత్రం కల్పించలేదు. కె.నగరపాలెం, కాపులదిబ్బడపాలెం, రెడ్డిలపాలెం, గొల్లలపాలెం, సోమన్నపాలెం, కాపులుప్పాడ, కల్లివానిపాలెం, బోయపాలెం ప్రాంతవాసులు బస్సు సౌకర్యం లేక నానావస్థలు పడుతున్నారు. ఈ మార్గంలోనే పలు కళాశాలలు, పాఠశాలలు, దేవాలయాలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు లేక కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి. ఆటో సౌకర్యం కూడా అంతంత మాత్రమే. దీంతో విశాఖ నగరానికి వెళ్లాలంటే ఓ పెద్ద సమస్యగా మారుతోంది. కనీసం ఉదయం, సాయంత్రం సమయాల్లో ఓ బస్సు నడిపితే బాగుంటుందని, దీనిపై ఆర్టీసీ యాజమాన్యం దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



కాపులుప్పాడకు వెళ్లే రోడ్డు

రోజూ ఇబ్బందే



మాకు బస్సు సౌకర్యం లేక రోజూ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పిల్లలను బడికి పంపాలన్నా, పెద్దలు పనికి వెళ్లాలన్నా ఓ గండంలా ఉంది. ఈ రూట్‌లో బస్సు నడపడం వల్ల సుమారు 8 ప్రాంతాల ప్రజలకు మంచి చేసిన వారు అవుతారు.

– వై. విష్ణు, కల్లివానిపాలెం

బస్సు నడపాలి



మా ప్రాంతంలో గతంలో రోడ్లు చిన్నవిగా ఉండడంతో బస్సులు రాకపోకలకు ఇబ్బందులు కలిగేవి. దీంతో గతంలో బస్సు సౌకర్యం నిలిపివేశారు. అయితే ప్రస్తుతం రోడ్లు విస్తరించడంతో బస్సు రాకపోకలకు అవకాశ ఏర్పడింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలి.

– ఎం. అప్పలరాజు, కె. నగరపాలెం.

ఆర్టీసీ అధికారులు దృష్టిపెట్టాలి



రోడ్డు విస్తరించిన నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించాలి. ఈ ప్రాంతాల్లో బస్సు నడపడం వల్ల స్థానికులకు సమస్య తీరడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుంది. బస్సులు లేక ఏ చిన్న అవసరమైనా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది.

– కోడిబోయిన వరహాలు, కాపులుప్పాడ.

ఉత్సాహంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



నృత్యం చేస్తున్న చిన్నారులు



వేషధారణలలో బాలబాలికలు

భీమునిపట్నం: మండల కేంద్రం భీమిలికి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, బలరాముడు, గోపికల వేషధారణలతో బాలబాలికలు చేసిన నృత్యాలు, వివిధ వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం జరిగిన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన స్కూల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షురాలు కైతపల్లి లావణ్య మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను ఇప్పటి తరం పిల్లలకు తెలియచెప్పవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలబాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేషధారణ పోటీలు

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరు శ్రీదుర్గా ఇంగ్లిషు మీడియం స్కూల్‌లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, సత్యభామ, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలో భాగంగా నృత్య ప్రదర్శనలు, భగవద్గీత శ్లోకాల పఠనం, కోలాటం, ఉట్టి సంబరాలు నిర్వహించారు. సినీ దర్శకుడు, ఉమా నారాయణ ఫౌండేషన్ చైర్మన్ బమ్మిడి శ్రీతారక్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణతత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ధరపురెడ్డి శ్రీధర్, ప్రిన్సిపాల్ భాగ్య అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐఐఎంవీ రోడ్డులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం మండలం గంభీరంలోని ఐఐఎంవీ రోడ్డులో ఆదివారం నుంచి మూడురోజుల పాటు హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. శ్రీకృష్ణ మందిర నిర్మాణం జరుగనున్న హరేకృష్ణ వైకుంఠం ప్రదేశంలో ఆది, సోమవారాల్లో సాయంత్రం 108 మంది ప్రసిద్ధ సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం నిర్వహించనున్నారు. భక్తులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 5నుంచి రాత్రి 9 వరకు నిర్వహిస్తారు. 108 పలకలతో ఏర్పాటు చేసిన హరినామ జపమండపంలో భక్తులు జపం చేయడానికి అవకాశం కల్పించనున్నారు. చివరి రోజైన మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో మహా మంగళహారతి, సప్త నదులైన గంగా, యమున, గోదావరి , సరస్వతి, నర్మద, కావేరి, సింధు నుంచి సేకరించిన 108 కళశాల పవిత్ర జలాలు, పండ్ల రసాలు, పంచామృతాలు, పంచగవ్యాలు, వివిధ పుష్పాలతో మహా అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం బాలగోపాలునికి ఉయ్యాలసేవ జరుపుతారు. ఉట్టి మహోత్సవం, కృష్ణతో సెల్ఫీ, రెండు వేర్వేరు చిత్రాల తేడాలను గుర్తించడం, కృష్ణుడు ఎవరు అనే అంశంపై పరీక్ష, ఇతర పోటీలు నిర్వహించనున్నారు. వివరాల కోసం అంబరీష దాస-9542511108, అధోక్షజ దాస-90630 20108 నంబర్లలో సంప్రదించాలని కోరారు. విశాఖ నగర ప్రజల సౌకర్యార్థం 25,26వ తేదీలలో ఇవే వేడుకలు ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో కూడా జరుగుతాయన్నారు.

ఆచరణాత్మక జ్ఞానంతో అద్భుత ఫలితాలు

మురళీనగర్ : ఆచరణాత్మక జ్ఞానంతోనే అద్భుత ఫలితాలు సాధ్యమవుతాయని ఆంధ్రా యూనివర్సిటీ రీజియన్ ఆర్‌జేడీ జె. సత్యనారాయణ మూర్తి అన్నారు. ఏపీసీటీఈ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వారం రోజులుగా తయారీ నాణ్యత అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంటు శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఉత్పత్తుల సాధనలో శాస్త్రీయత, విశ్లేషణాత్మకత అంశాలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా నాణ్యతా ప్రమాణాలు సాధించగలమన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని శిక్షణ పొందిన అధ్యాపకులు మెకానికల్ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ కె. రాంజీ మాట్లాడుతూ నైపుణ్యం విద్యార్థులకు అత్యంత శక్తివంతమైన పరికరమన్నారు. విశాఖ రిఫైనరీ డీజీఎం కేతు శ్రీధర్ మాట్లాడుతూ తయారీలో నాణ్యత నిర్వహణ పరిశ్రమల్లోనే కాకుండా నిజ జీవితంలో కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు ధ్రువపత్రాలు అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ విభాగాల హెడ్‌లు,అధ్యాపకులుపాల్గొన్నారు.

రోడ్డు పైనే మురుగు నీరు

చంద్రంపాలెంలో నిత్యం ఇదే తంతు



చంద్రపాలెం వద్ద సర్వీసు రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

మధురవాడ: జీవీఎంసీ 7వవార్డులోని చంద్రంపాలెం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రధాన కాల్వలు, మ్యాన్ హోల్స్ నిత్యం బ్లాక్ అయిపోయి మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. సాధారణ పరిస్థితుల్లో నిత్యం ఇదే పరిస్థితి ఉంటోంది. ఇక చిన్న పాటి వర్షం కురిసినా రోడ్డు, కాలువలు ఏకమైపోయి అడుగు తీసి అగుడు వేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. జీవీఎంసీ శానిటేషన్ సిబ్బంది నిర్వహణ, పూడిక తీసే పనులు సక్రమంగా చేపట్టక పోవడం, చిన్న పాటి మరమ్మతులను కూడా చేయకుండా వదిలేయడంతో సమస్య రోజు రోజుకూ పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. జాతీయ రహదారుల సంస్థ ఫుట్ పాత్, పైపులైన్‌ల కోసం ఏర్పాటు చేసిన కాల్వ కూడా మురుగునీటి కాల్వలా మారిపోయింది. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సింహగిరిపై సెల్‌ఫోన్ కౌంటర్‌లో అక్రమ వసూళ్లు

- ఏఈఓ ఆకస్మిక తనిఖీల్లో బయటపడిన వైనం

సింహాచలం: సింహగిరిపై భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్‌లో దేవస్థానం అవుట్ సోర్సింగ్ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వైనం శనివారం ఆకస్మికంగా దేవస్థానం ఏఈవో చేసిన తనిఖీల్లో బయటపడింది. వివరాలలోకి వెళ్తే.. భక్తుల సెల్‌ఫోన్లు భద్రపరిచేకాంట్రాక్ట్‌ను చేయలేక కాంట్రాక్టర్ఇటీవల విరమించుకున్నాడు. దాంతో దేవస్థానమే స్వయంగా తమ సిబ్బందిని కౌంటర్లలో నియమించి సెల్‌ఫోన్ భద్రపరిచే ఏర్పాటు చేసింది. కౌంటర్లలో ఒక్కో సెల్‌ఫోన్‌కి రూ.5 చొప్పున వసూలు చేయాల్సి ఉంది. ఈ తరుణంలోనే రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారన్న విషయం ఇటీవల చర్చాంశనీయమైంది. దీంతో శనివారం దేవస్థానం ఏఈవో పాలూరి నరసింగరావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జారీ చేసిన టికెట్లు కంటే రూ.960 నగదు మహిళా అవుట్ సోర్సింగ్ ఉద్యోగి వద్ద అధికంగా ఉన్నట్టు గుర్తించారు. రిపోర్టు తయారుచేసి ఈవో దృష్టికి తీసుకెళ్లారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే జ్యూట్ కార్మికులకు న్యాయం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు న్యాయం జరిగిందని మిల్లు ఇంటక్ వర్కింగ్ ప్రెసిడెంట్ జీరు వెంకటరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 2009లో లాకౌట్ జరిగిన సమయంలో పురందేశ్వరి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర మంత్రిగా ఉండి కూడా న్యాయం చేయలేదని గుర్తు చేశారు. అప్పటి నుంచి పలుమార్లు ఢిల్లీ, హైదరాబాద్, అమరావతి, విశాఖలో యాజమాన్యం, అధికారులు, మంత్రులతో జరిగిన చర్చలకు, సమావేశాలకు అన్ని కార్మిక సంఘాల నాయకులు ఎవరి ఖర్చులు వారు పెట్టుకుని హాజరయ్యారని చెప్పారు. ఇంటక్ అధ్యక్షుడు కాకర్లపూడి వరహాలరాజు కొంత ఖర్చు చేశారన్నారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంత్రి అయిన తరువాత 90 శాతం బకాయిలు మిల్లు యాజమాన్యం నుంచి ఇప్పించారని తెలిపారు. ఇప్పుడు మారుపేరు కార్మికుల కోసం కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడి ఆర్థిక సాయంతో కార్మిక సంఘాలు ఢిల్లీ వెళ్తున్నట్టు ప్రకటన విడుదల చేయడంలో అర్థం లేదన్నారు. మారుపేరు కార్మికుల సమస్య కోసం ఢిల్లీలో నాయకుల చుట్టూ తిరిగేకంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించడం మంచిదని వెంకటరెడ్డి పేర్కొన్నారు.

నేడు లక్ష తులసీ పూజ



మామిడి తోరణాలతో అలంకరించిన కుంతీ మాధవ స్వామి ఆలయ లోపల భాగం



పూజకు సిద్ధం చేసిన తులసీ దళాలు

పద్మనాభం: మండల కేంద్రం పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం లక్ష తులసీ పూజ నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పూజకు అవసరమయ్యే తులసీ దళాలను సిద్ధం చేశారు. కుంతీ మాధవ స్వామి ఆలయ లోపల భాగాన్ని మామిడి తోరణాలతో, గాలి గోపురం ముందు భాగాన్ని అరటి చెట్లతో అందంగా అలంకరించారు. లక్ష తులసీ పూజ అనంతరం కుంకుమ పూజ నిర్వహిస్తారు.

బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు



మూసివేసిన ఆనందపురం హైవేపై నిరుపయోగంగా బస్ షెల్టర్



వేములవలస కూడలిలో ఆటోస్టాండ్‌గా మారిన బస్‌షెల్టర్

తగరపువలస: ఆనందపురం, వేములవలస కూడళ్లలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. ఫ్లై ఓవర్ల కిందే వేచి ఉంటూ ఎండావానల నుంచి రక్షణ పొందుతున్నారు. ఆరేళ్ల క్రితం జాతీయరహదారుల విస్తరణ జరగక ముందు విశాఖ వెళ్లే జాతీయ రహదారితో పాటు వేములవలస కూడలిలో బస్ షెలర్లు ఉండేవి. రహదారుల విస్తరణ తరువాత మార్గాల దిక్కులే మారిపోయాయి. వేములవలస కూడలి వద్ద సర్కిల్ ఏర్పాటు చేశారు. దీంతో విశాఖ నుంచి వచ్చే బస్సులు హైవే మీద నుంచి కాకుండా వేములవలస కూడలి మీదుగా వెళ్తున్నాయి. పెందుర్తి మీదుగా అనకాపల్లి వెళ్లేందుకు ఫ్లై ఓవర్‌తో పాటు కింద నుంచి కూడా మార్గాన్ని కేటాయించారు. దీంతో ఈ రెండు చోట్లా షెల్టర్లు నిరుపయోగంగా మారిపోయాయి. జాతీయరహదారి పాత మార్గంలో షెల్టర్‌ను యాచకులు తలదాచుకుంటున్నారు. వేములవలస కూడలిలో షెల్టర్‌ను ఆటోస్టాండ్‌గా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వాహనాలు నడుస్తున్న మార్గంలో షెల్టర్లు ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

వెండి ధనుస్సు దర్శనం.. పులకించిన భక్త జనం



వెండి ధనుస్సుకు పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

మధురవాడ: అయోధ్య రామాలయానికి అందజేయనున్న వెండి ధనుస్సును దేశమంతా వివిధ దేవాలయాల్లో భక్తుల సందర్శనకు ఉంచుతున్నారు. దీనిలో భాగంగా మధురవాడ మిథిలాపురి ఉడా కాలనీ బాలాలజీ కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో శనివారం సాయంత్రం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీరామ చంద్రుడు 14ఏళ్ల వనవాసం చేసిన దానికి గుర్తుగా 14 కిలోల వెండి, కిలో బంగారంతో హైదరాబాదుకు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి ఏడు అడుగుల కోదండాన్ని తయారు చేయించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాల్లోని దేవాలయాలు, శృంగేరి, కంచి పీఠాల్లో పూజలు, భక్తుల దర్శనం అనంతరం అక్టోబర్‌లో అయోధ్యలో రామాలయ ట్రస్ట్‌కు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా తరలి వచ్చి వెండి ధనుస్సును స్పర్శ దర్శనం చేసుకుని పులకించి పోయారు. ముందుగా ఆలయంలో ప్రధాన అర్చకుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ప్రతినిధులు సాయిలీల, మగ్గూరి వెంకటరమణ, చక్రధరరావు, గరిమెళ్ల నాగేశ్వరరావు, పాత్రుడు తదితరులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి సీజ్



గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన యువకులతో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం : విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను రైల్వే పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి సుమారు రూ. 88 వేలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బంది రైల్వేస్టేషన్‌లో గల వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహిస్తుండగా మాలప్పురం, కేరళకు చెందిన అబ్దుల్ మాలిక్, మహ్మద్ ముస్ఫిర్, మహ్మద్ ఫాజిల్ అక్రమంగా గంజాయి రవాణా చేయడం గుర్తించారు. వీరు ఈ గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా కేరళకు తరలిస్తున్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి సుమారు రూ. 88 వేల విలువైన 17.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎస్ఐ ఎస్.కె. అబ్దుల్ మారూఫ్‌కు అప్పగించినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.